❖•❖•❖ 63 ❖•❖•❖

# మొదటి ఆదివారము: పునరుత్థాన పరిచర్య – 1

*"విశ్రాంతి దినము గడిచిపోయిన తరువాత ఆదివారమున తెల్లవారుచుండగా, మగ్దలేనే మరియయు వేరొక మరియయు సమాధిని చూడ వచ్చిరి. ఇదిగో **ప్రభువు** దూత పరలోకమునుండి దిగివచ్చి, రాయి పొర్లించి దాని మీద కూర్చుండెను; అప్పుడు మహా భూకంపము కలిగెను" (మత్తయి 28:1, 2).*

*"యేసు క్రీస్తు, శరీరమునుబట్టి దావీదు సంతానముగాను, మృతులలోనుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను" (రోమీయులకు 1:2-7).*

జాన్ మెక్‌డోవెల్ ఇలా వ్రాస్తున్నాడు, "యేసు వెలుపలికి రాగలుగునట్లు సమాధి ద్వారమునకు అడ్డంగా ఉంచబడిన రాయిని దూత పొర్లించలేదు; మానవుడు సమాధి లోపలికి వెళ్లునట్లు యేసే దానిని పొర్లించాడు." అనగా, యేసు నిజముగా మృతులలో నుండి లేచియున్నాడని మానవుడు సమాధి లోపలికి వెళ్లి తానే స్వయంగా చూడవలెనని దేవుడు ఆశించాడని మరో మాటలో చెప్పుకొనవచ్చును.

క్రైస్తవ్యత నిజాయితీకి యేసు పునరుత్థానము కీలకమైనదై యున్నది. ఆయన ఒక అబద్ధికుడుగా, మారువేషం ధరించి మనుష్యులను వంచించుచుండినవాడుగా, మరియు దేవదూషకుడుగా సిలువవేయబడినాడు. ఆయన మృతులలో నుండి లేవకుండినట్లయితే,

ప్రపంచమంతా పైన పేర్కొనబడిన పేర్లన్నిటినీ ఉన్నవి ఉన్నట్టుగా అక్షరాలా ఆయనకు తగిలించేదే. ఆయన మృతులలో నుండి లేచునని వాగ్దానం చేశాడు (మత్తయి 16:21; 17:22, 23; 20:18, 19; మార్కు 8:31; 9:31; లూకా 9:22; 18:31–33). ఆయన లేవకుండినట్లయితే, ఆయన వంచకుడనిపించుకునేవాడే, ఏలయనగా ఆయన దేవుని కుమారుడని స్వాధికారంతో చాటిచెప్పాడు (ఆయనకు అధికారమున్నదని ఆయనిచ్చిన రుజువును మార్కు 2:9, 10లో చూడుము). ఆయన మృతులలో నుండి లేవకుండినట్లయితే, ఆయన మారువేషం ధరించి మనుష్యులను వంచించుచుండినవాడును, దేవదూషకుడనై యుండును. యేసు మృతులలో నుండి లేవడము లేదా లేవకపోవడమన్నదే ఆయన స్వాధికారంతో చాటిచెప్పిన సత్యములకు సర్వోచ్ఛమైన పరీక్షయై యుండినది. ఈ భావం ప్రకారం యేసు క్రీస్తు పునరుత్థానము క్రైస్తవత్యమునకును ఆయన దైవత్వమునకును శేఖర భూషణము వంటి ఉత్కృష్టమైన మూలాధార రుజువునై యున్నది.

బహుశ పునరుత్థానము క్రైస్తవ్యము యొక్క పునాదికి అవి నా భావ భాగమైయున్నదని వాస్తవము పునరుత్థానము గూర్చి పరిశుద్ధాత్మ లేఖనములలో ఇంత సవిస్తరంగా చర్చించుటకు గల కారణమై యుండును. మనము ఆయన పునరుత్థానము యొక్క వివరణ అంతటిని సంపూర్తిగా తెలిసికొనవలెనని దేవుడు కోరుచున్నాడు. మనము దాని విదితమైన వివరములన్నిటితో, ఒక నాటక రూపములో, మానవీయ మరియు దైవీకమైన లక్షణముతో దానిని చూడవలెనని ఆయన ఆశిస్తున్నాడు.

ఆయన సజీవుడైయున్నాడని యేసు, శ్రమలు పొంది మరణించిన తరువాత, “అనేక ప్రమాణములను చూపి” తనకుతానే కనుపరచుకొన్నాడని లూకా చెప్పుచున్నాడు (అపొస్తలుల కార్యములు 1:3). KJVలో గల మాటలు “అనేక పొరపాటుపడని నిదర్శనముల చేత” అని అర్థమిచ్చుచున్నవి. ఆయన పునరుత్థానుడయ్యాడని యేసు మనకిచ్చిన నిదర్శనములు కాదని వాదించి కొట్టిపారేయ తగినవి కావు లేక అలక్ష్యము చేయతగినవి కావు. అవి ఎంతో స్పష్టంగాను ఒప్పించునవిగాను ఉన్నవి.

ఆయన పునరుత్థానము గూర్చి క్రొత్త నిబంధలో ఇవ్వబడిన వాస్తవములను ఇప్పుడు క్రోడీకరించి వాటిని చారిత్రక కాలక్రమానుసారంగా ఏర్పాటు చేద్దాము. అప్పుడు మనము ఆయన పునరుత్థాన చిత్తరువునంతటిని స్పష్టంగా చూచి అర్థంచేసికొనగలము. అది అద్భుతములకే ఒక అద్భుతంగా ఉన్న ఈ అద్భుతము గూర్చి పరిశుద్ధాత్మ రచించిన అధిక సంఖ్యాక వివరములను మనముందుంచును. అంతమాత్రమేగాక, ఆచరణాత్మక అంశానికొస్తే, అనుదినము ఆధ్యాత్మికంగా క్షేమాభివృద్ధి నొందుచుండవలసిన మన దైనందిన జీవితాలకు పునరుత్థానము గూర్చిన ఈ వివరములు ఎలా తోడ్పడునో వీటి ద్వారా మనము స్పష్టంగా తెలిసికొనగలము.

*మొట్టమొదటిగా, పునరుత్థానము శోకగ్రస్తులకు ఆదరణ నిచ్చును.* యేసు పునరుత్థానుడైన తరువాత మొట్టమొదట ఆదివారం తెల్లవారుజామును సమాధియొద్ద దుఃఖపడుచు ఏడ్చుచుండిన మగ్దలేనే మరియకు ప్రత్యక్షమయ్యాడు (మార్కు 16:9).

శుక్రవారం సందెవేళప్పుడు, అరిమతయియ యోసేపు, యేసు యొక్క రహస్య శిష్యుడు మరియు యూదుల మహాసభ[1] సభ్యుడు, పిలాతు నొద్దకు వెళ్లి యేసు దేహమును సిలువ మీద నుండి క్రిందకు దింపి పాతిపెట్టుటకు అనుమతినిమ్మని అడిగాడు. యేసు శిష్యులని

బహిరంగముగా ఒప్పుకొనుటకు భయపడనివారు పిలాతు నొద్దకు వెళ్లి యేసు దేహము కొరకు అడుగుటకు భయపడుచుండిరనియు, ఆయన శిష్యుడని బహిరంగముగా ఒప్పుకొనుటకు భయపడుచుండినవాడు పిలాతు నొద్దకు వెళ్లి యేసు దేహము కొరకు అడుగుటకు భయపడలేదనియు స్పష్టమగుచున్నది. యోసేపు అడిగిన మనవిని పిలాతు అంగీకరించాడు. నీకొదేము, యూదుల అధికారియైన పరిసయ్యుడు (యోహాను 3:1),[2] రమారమి నూట ఏబది సేర్ల యెత్తు బోళముతో కలిపిన అగరు తెచ్చినవాడు, యోసేపుతో చేరాడు. వీరిద్దరు భక్తిమర్యాదలతో యేసు దేహమును సిలువమీదనుండి క్రిందకు దింపి, యోసేపు తెచ్చిన విలువైన నార బట్టతో చుట్టి, దాని మడతలలో నీకొదేము తెచ్చిన సుగంధద్రవ్యములను పోసారు. యోసేపు తాను సొంతంగా స్వయం కొరకు రాతిలో తొలిపించుకొనిన ఒక క్రొత్త సమాధి[3] యేసు సిలువవేయబడిన స్థలమునకు సమీపములో నుండిన తోటలో ఉండినది (మత్తయి 27:60; యోహాను 19:41). వారు యేసు దేహమును మోసికొని వెళ్లి ఆ సమాధిలో ఉంచారు.

స్త్రీల గుంపొకటి యోసేపు మరియు నీకొదేమును వెంబడించుచు యేసు దేహము పాతిపెట్టబడుట గమనించుచునే యుండిరి, గనుక సమాధి ఎక్కడ ఉండినదో ఆ స్థలాన్ని మనస్సుల్లో బాగా గుర్తుపెట్టుకున్నారు (మత్తయి 27:61; మార్కు 15:47; లూకా 23:55). పాతిపెట్టబడుటకు యేసు దేహము సరియైన విధానంలో సిద్ధంచేయబడలేదని గ్రహించి, వారి ఇళ్లకు వెళ్లిపోయి సమాధియొద్దకు తరువాత తీసికొనివెళ్లవలెనని ఆశించి సుగంధద్రవ్యములను మరియు పరిమళ తైలమును తయారు చేసికొన్నారు (మార్కు 16:1; లూకా 23:56ఎ). శనివారం నాడు వారు విశ్రాంతి తీసికొనుట ద్వారా సబ్బాతు ఆచరణ గూర్చి మోషే ఇచ్చిన ధర్మశాస్త్రమును నెరవేర్చారు (లూకా 23:56).

శనివారంనాడు, ప్రధానయాజకులును పరిసయ్యులును పిలాతు యొద్దకు వచ్చి, "అయ్యా, ఆ వంచకుడు సజీవుడై యుండినప్పుడు, మూడు దినములైన తరువాత నేను లేచెదనని చెప్పినది మాకు జ్ఞాపకమున్నది. కాబట్టి మూడవ దినమువరకు సమాధిని భద్రముచేయ నాజ్ఞాపించుము; వాని శిష్యులు వచ్చి వానిని ఎత్తుకొనిపోయి, ఆయన మృతులలోనుండి లేచెనని ప్రజలతో చెప్పుదురేమో; అప్పుడు మొదటి వంచనకంటె కడపటి వంచన మరి చెడ్డదై యుండునని" చెప్పిరి. అందుకు పిలాతు, "కావలివారున్నారుగదా మీరు వెళ్లి మీ చేతనైనంత మట్టుకు సమాధిని భద్రము చేయుడని" వారితో చెప్పెను. వారు వెళ్లి కావలివారిని కూడ ఉంచుకొని, (సమాధికి అడ్డంగా పొర్లించబడిన) రాతికి ముద్రవేసి సమాధిని భద్రము చేసిరి (మత్తయి 27:62-66 చూడుము).

యేసు సిలువవేయబడినప్పటినుండి మూడవ దినమున,[4] ఆదివారం ఉదయం, తెల్లవారక మునుపు,[5] ఐదుగురు స్త్రీల గుంపొకటి సమాధి యొద్దకు వచ్చుటకు యెరూషలేము నుండి బయలుదేరింది. వారిలో కొందరి పేర్లు మనకు చెప్పబడినవి: మగ్దలేనే మరియ, యాకోబు తల్లియైన మరియ, యోహన్న, మరియు సలోమే (మార్కు 16:1; లూకా 24:10). యేసు దేహము సమాధి చేయబడుటకు యింకా మంచిగాను శాశ్వతంగాను నిలిచియుండు రీతిలో సుగంధద్రవ్యములు మరియు పరిమళ తైలము పూయబడవలసి యున్నదని వారు నమ్మారు.

సమాధియొద్ద, ఆదివారం తెల్లవారు జామున, మహా భూకంపము సంభవించినది. సమాధికి అడ్డంగా ఉంచబడిన రాయిని ప్రభువు దూత పొర్లించి దాని మీద కూర్చున్నాడు

(మత్తయి 28:2).[6] దూత అగుపించుట ఒక మెరుపువలె ఉండినది, ఆయన వస్త్రము హిమమంత తెల్లగా ఉండినది (మత్తయి 28:3). కావలివారు చచ్చినవారివలె నేలకు ఒరిగారు (మత్తయి 28:4). సమాధిని సందర్శించుటకు వచ్చినవారికి అది ఖాళీ సమాధియని బయలుపరచవలెనని దేవుడు ఉద్దేశించాడు; అందువలననే, ఆ రాయి అత్యద్భుతంగా పొర్లించబడింది. యేసు భూకంపము సంభవింపబోవుచుండిన కొద్ది క్షణములకు మునుపే లేచియుండును. అటుతరువాత, కావలివారిలో కొందరు యెరూషలేము పట్టణములోనికి వెళ్లి జరిగినదానంతటిని ప్రధాన యాజకులకు వివరించి చెప్పారు. గనుక వెంటనే సన్హెడ్రిన్ సభ సమావేశమయ్యింది. రాత్రివేళ యేసు శిష్యులు వచ్చి ఆయన దేహమును దొంగిలించుకొని వెళ్లారని సైనికులు చెప్పినట్లయితే వారికి పెద్ద మొత్తములో లంచమిచ్చుటకు సమావేశమైన సభ ఏకగ్రీవంగా సమ్మతించింది. సైనికులు ఇదే అదనుకొని ఇవ్వబడిన సొమ్ము తీసికొని వారికి చెప్పబడినట్లే చేశారు (మత్తయి 28:11-15).

సమాధి యొద్దకు ఎవరూ రాక మునుపే చేరుకొనవలెనని పెందలకడనే బయలుదేరిన స్త్రీల గుంపు ఇప్పుడు సమాధిని సమీపిస్తున్నారు. వారు సమాధికి దగ్గరగా వచ్చుచున్నారని గుర్తెరిగినప్పుడు, వారిలో ముఖ్యమైన ప్రశ్నొకటి తలెత్తింది: (అబలలమైన మన నిమిత్తము) "సమాధి ద్వారమునుండి మనకొరకు ఆ రాయి యెవడు పొర్లించును?" (మార్కు 16:3). నిజమే కదా, సామాన్యంగా వారు సమాధి యొద్దకు వచ్చుటకు యెరూషలేము నుండి బయలుదేరక మునుపే వేసికొనవలసిన ఒక వివేకవంతమైన ప్రశ్నే, అయితే ఈ స్త్రీలు యేసు మరణించినప్పుడుండిన పరిస్థితుల చేత నిర్బంధింపబడుచుండుటనుబట్టి, ఈ విషయమంతా ఎంతసేపూ వారి హృదయాల్లోనే కదులుతూ ఉండినది, కానీ వారి మెదడులో మెదలలేదు. వారు బుద్రనుపయోగించుచు ఆలోచించియుండినట్లయితే, సమాధి యొద్దకు వెళ్లాలను సలహా తలంపుల్లోకి వచ్చిన అదే సమయంలో వారు, "మనము సమాధి లోపలికి ఎలా వెళ్లగలము? అంత పెద్ద రాయిని మన కొరకు ఎవరు దొర్లిస్తారు? సమాధి లోపలికి వెళ్లలేకపోతే, మనము వెళ్లి ప్రయోజనముండదు గనుక వెళ్లడం మానివేద్దాము!" అని ఒకరితో నొకరు చెప్పుకొని యుందురు. అయితే వారికి యేసు యెడల ఉండిన ప్రేమానురాగములు మరియు ఆధరాభిమానముల చేత మనస్సులు కరిగినవారై, ఏంచేయాలో నిర్ణయించుకొని, కార్యక్రమ వ్యూహరచన గూర్చి ఎక్కువగా ఆలోచన చేయకుండానే బయలుదేరారు. సౌహార్దమైన సహృదయాలు తరుచుగా ప్రతిస్పందించే విధానం ఇదే.

వారు సమాధి కనబడునంత దగ్గరకు చేరుకొనినప్పుడు, వారు ఆకాశమువైపు కన్నులెత్తి, "లోపలికి వెళ్లడమెలా?" అను ప్రశ్న అప్పటికే పరిష్కరింపబడిందని కనుగొన్నారు. రాయి దొర్లింపబడి యుండినది (మార్కు 16:4). మగ్దలేనే మరియ మార్గము మధ్యలేనే ఆగిపోయి. వెంటనే యేసు దేహమును ఎవరో ఎత్తుకొనిపోయారను తుది తీర్మానమునకు వచ్చినది. మరియకు, "సమాధి లోపలికి వెళ్లడమెలా?" అను ప్రశ్నకంటే ఖాళీ సమాధే మరింత గొప్ప సమస్యను తెచ్చిపెట్టింది. ఇప్పుడేంచేయాలో అని గాని అసలేంజరిగియుండునో అని గాని విచారించుటకు వీలులేనంతగా కంగారు పడిపోయింది, కానీ వెనుకకు మళ్లి, పేతురు యోహానులను కనుగొని వారికి ఆమె కనుగొన్న విషయాన్ని తెలియజెప్పవలెనని యెరూషలేమునకు పరుగెత్తుకొని వెళ్లింది (యోహాను 20:2).

మగ్దలేనే మరియతో కూడ వచ్చిన ఇతర స్త్రీలు మరియ వెళ్లిపోయినట్లుగా సమాధి

దగ్గర నుండి వెళ్లిపోలేదు. జరిగిన విషయమేమిటో తెలిసికొనవలెనని ప్రయత్నిస్తూ, వారు జాప్యం చేశారు. ఎట్టకేలకు వారు పిరికితనముతో సమాధి ద్వారము నొద్దకు వెళ్లి లోపలికి వెళ్లారు. లోపల, వారు ఇద్దరు దూతలను చూశారు (లూకా 24:4).[7] స్త్రీలు భయభ్రాంతులై ఆ దూతల ముందర వారి ముఖములను నేల మోపారు. దూతలలో ఒకరు స్త్రీలతో మృదువుగా మాటలాడుచు, "మీరు భయపడకుడి, సిలువేయబడిన యేసును మీరు వెదకుచున్నారని నాకు తెలియును; ఆయన ఇక్కడ లేడు; తాను చెప్పినట్టే ఆయన లేచియున్నాడు; రండి ప్రభువు పండుకొనిన స్థలము చూడండి ..." అని పలికాడు (మత్తయి 28:5, 6). వారికి తెలియజెప్పబడిన ప్రకారము ఆ స్త్రీలు చూచుచు యేసు దేహము ఉంచబడియుండిన చల్లని రాతి పలకను గమనించారు. ఆయన మృతులలో నుండి లేచునని ప్రభువు ఇచ్చిన వాగ్దానమును కూడ దూత వారికి గుర్తుచేశాడు: "ఆయన ఇంక గలిలయలో ఉండినప్పుడు, మనుష్యకుమారుడు పాపిష్టులైన మనుష్యుల చేతికి అప్పగింపబడి, సిలువవేయబడి, మూడవ దినమందు లేవవలసియున్నదని ఆయన మీతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొనుడి" (లూకా 24:6బి, 7). ఆ తరువాత, దూత ఆ స్త్రీలకు ఒక ఆదేశము నిచ్చాడు: "త్వరగా వెళ్లి, ఆయన మృతులలోనుండి లేచియున్నాడని ఆయన శిష్యులకు తెలియజేయుడి; ఇదిగో, ఆయన గలిలయలోనికి మీకు ముందుగా వెళ్లుచున్నాడు, అక్కడ మీరు ఆయనను చూతురు, ఇదిగో మీతో చెప్పితిని" (మత్తయి 28:7). దుఃఖముఖులై యుండిన స్త్రీలు ఇప్పుడు వారి హృదయాలను శుభసందేశ మహదానందముతో నింపుకొని సమాధి యొద్దనుండి వెళ్లియుందురు. మనస్సుపై తీవ్రమైన భక్తిపూర్వక భయముతో కూడిన ముద్రను వేయు యేసు, దేవుని కుమారుడు, ఇహమందు వారి మధ్యను ఉంటూ కనుపరచిన పునరుత్థాన లక్షణమును కూడ వారు తెలిసికొని యుందురు (మత్తయి 28:8).

ఈ మధ్య కాలంలో, మగ్దలేనే మరియ, యెరూషలేములో పేతురు యోహానులు నివసించుచుండిన ఇంటికి తిరిగి వచ్చినది. ఆమె పేతురును యోహాను చూచి, "ప్రభువును సమాధిలో నుండి యెత్తికొనిపోయిరి, ఆయనను ఎక్కడ ఉంచిరో యెరుగము" అని వారితో చెప్పినది (యోహాను 20:2). మరియు వారితో చెప్పిన మాటలు విన్న పేతురు మరియు యోహాను ఉక్కిరిబిక్కిరైపోయారు. విషయము తెలిసిన తరువాత ఆందోళన చెంది వారు వెంటనే సమాధి యొద్దకు పరుగు తీశారు. యోహాను పేతురు కంటే త్వరగా పరుగెత్తి, ముందుగానే సమాధి యొద్దకు చేరుకున్నాడు కానీ సమాధి లోపలికి వెళ్లలేదు. సమాధి లోపల యేసు దేహము ఉంచబడిన స్థలంవైపు తొంగి చూస్తూ, పేతురు రాక కొరకు వేచియుంటూ, ఆయన సమాధికి వెలుపటనే భక్తిపూర్వకంగా నిలబడిపోయాడు (యోహాను 20:4, 5). పేతురు తన దుడుకు తత్వంగల ధైర్యంతో, సమాధి యొద్దకు వచ్చినప్పుడు, ఆయన సమాధి లోపలకు వెళ్లాడు, యోహాను అతని వెంట వెళ్లాడు (యోహాను 20:6, 8).

వీరిద్దరు సరిగ్గా ఏంచూశారో మనము సంపూర్తిగా చెప్పలేము. ఎన్ ఎ ఎస్ వి అంగ్ల అనువాదము ఇలా చెప్పుచున్నది, "ఆయనను వెంబడిస్తూ, సీమోను పేతురు కూడా వచ్చి, సమాధి లోపలకు వెళ్ళాడు; యేసు దేహమునకు చుట్టబడిన నారబట్టలు అక్కడ పడియుండుట చూశాడు, యేసు తలపై యుండిన ముఖాన్ని కప్పుకొను బట్ట, చుట్టబడిన నారబట్టలతో కూడ గాక, ఉన్న చోటనే అదొక్కటే చుట్టబడి యుండుట చూశాడు" (యోహాను 20:6, 7). చుట్ట బడిన నారబట్టలు అక్కడ ఉండిన తీరుకు సంబంధించిన గ్రీకు పదమును

NASVలో "అక్కడ పడియుండిన" అని అనువదించినది. "చక్కగా సంఘటితము చేయబడి యుండుట" లేక "క్రమపద్ధతిలో అమర్చబడి యుండుట" అనునది ఈ పదము యొక్క అర్థమనియు, చుట్ట బడిన నారబట్టలు మడతపెట్టబడి యుండెనను అర్థము నిచ్చుచున్నదని తెలిసికొనవలెననియు పాత కాలంనాటి పండితులు వాదించారు. ఈ పదము మామూలుగా "చుట్టగా/ఉండగా చుట్టబడిన" అను అర్థమిచ్చుచున్నదనియు, యేసు దేహము అక్కడ లేదు గాని ఆయన దేహమునకు ఆ నారబట్టలు ఎలా చుట్టబడినవో యింకా అలాగే చుట్టబడే ఉన్నాయన్నట్టుగా అగుపించుచుండినవనియు ఇటీవలి పండితులు నొక్కివక్కాణించుచున్నారు. అనగా, నారబట్టలు పట్టుపురుగు గూడును పోలిన ఆకారము కలిగియుండినవని మరో మాటలో చెప్పుకొనవచ్చును. పాతకాలంనాటి పండితులే సరిగా చెప్పారని అర్థమగుచున్నది, ఎందుచేతనంటే, "అయితే పేతురు లేచి, సమాధియొద్దకు పరుగెత్తికొనిపోయి; వంగిచూడగా, నారబట్టలు మాత్రము విడిగా కనబడెను; అతడు జరిగిన దానిని గూర్చి ఆశ్చర్యపడుటు ఇంటికి వెళ్లెను" అని లూకా 24:12 చెప్పుచున్నది.[8] పేతురు నమ్మాడని చెప్పబడుట'లేదు; ఆయన చూచిన దాని గూర్చి ఆశ్చర్యపడినాడని మాత్రమే చెప్పబడింది. యోహాను గూర్చైతే, "చూచి నమ్మెను" అని చెప్పబడింది (యోహాను 20:8బి). పేతురు పట్టుపురుగు గూడువంటి దానిని చూచియుంటే, ఖచ్చితంగా నమ్మేవాడే. ఈ పట్టుపురుగు గూడువంటి దాని కంటే మనకు యింకెంత బలమైన నిదర్శనం కావాలి? పేతురు నమ్మలేదను వాస్తవము వారు నారబట్టలు చక్కగా ఒక క్రమమైన పద్ధతి ప్రకారం మడత పెట్టిబడి, ఉండిగా చుట్టబడి యుండిన ముఖమును కప్పుకొను బట్టతో కూడ గాక, వేరుగా ఉండినట్లు చూశారను అభిప్రాయమునకు హేతువగుచున్నది. యేసు దేహమును ఎవరో ఎత్తికొనిపోయి యుండినట్లయితే, నారబట్టలు అక్కడే విడిచిపెట్టబడుట విచిత్రంగా ఉన్నది సరికదా దొంగలు ఆ నారబట్టలను ఎత్తుకొనిపోకుండా సమయం తీసికొని వాటిని చక్కగా మడత పెట్టి అక్కడే వదిలిపెట్టి వెళ్లిపోవుట అంత కన్నా విచిత్రంగా ఉన్నది, ఈ పరిస్థితిని చూచిన పేతురు నివ్వెరపోయి అబ్బురపడ్డాడు; కానీ యేసు మృతులలో నుండి లేచాడని తాను చూచిన దాని చేత యోహాను ఒప్పింపబడ్డాడు. ఆ తరువాత ఇద్దరూ కలిసి సమాధి యొద్ద నుండి బయలు దేరి యెరూషలేములో నున్న వారి ఇంటికి తిరిగి వచ్చారు.

ఇక చిట్టచివరకు, మగ్దలేనే మరియ మరలా సమాధి యొద్దకు వచ్చినది. తోటలోని సమాధి యున్న చోటు ఇప్పుడు నిర్జన ప్రదేశమయ్యింది. వచ్చిన స్త్రీలంతా యెరూషలేమునకు తిరిగి వెళ్లిపోయి ఎంతో సేపయ్యింది. పేతురు మరియు యోహాను అప్పటికే సమాధిని సందర్శించి వెళ్లిపోయారు. మరియు సమాధి ద్వారము నొద్దకు వచ్చింది ఏడుస్తూ ఉన్నది, దిగ్భ్రమ చెందియున్నది, అలసిసొలసిపోయింది. ఆమె సమాధి యొద్దకు మొదటిసారి వచ్చినప్పుడు, సమాధి అంతటిని లోపల వెలుపల ఆమె క్షుణ్ణంగా పరిశీలించి చూడలేదు. గనుక ఈసారి వంగి సమాధి లోపలకు చూసింది "తెల్లని వస్త్రములు ధరించిన యిద్దరు దేవదూతలు యేసు దేహము ఉంచబడిన స్థలములో తలవైపున ఒకడును కాళ్లవైపున ఒకడును కూర్చుండుట కనబడెను" (యోహాను 20:12). ఏదో ఒక కారణంచేత వారు దేవదూతలని ఆమె గుర్తుపట్టలేదు. ఆ కారణమేంటో మనకు తెలియదు. బహుశ ఆమె కళ్లు కన్నీటితో నిండియుండినందువలన స్పష్టంగా చూడలేకపోయియుండవచ్చును, లేదా వారు తోటమాలి చేతి క్రింద పనిచేయు సహాయకులు కాబోలు అని అనుకొంటూ ఆమె

నేరుగా వారినే చూచియుండకపోవచ్చును. దేవదూతలలో ఒకడు, “అమ్మా, యెందుకు ఏడ్చుచున్నావు?” అని ఆమెను అడిగాడు (యోహాను 20:13ఎ). అందుకామె, “నా ప్రభువును ఎవరో యెత్తికొనిపోయిరి; ఆయనను ఎక్కడ ఉంచిరో నాకు తెలియలేదు” అని జవాబిచ్చింది (యోహాను 20:13బి). ఆ తరువాత మరియ వెనుకకు తిరిగి చూడగా యేసు అక్కడ ఆమెకు ఎదురుగా నిలువబడి యుండుట చూచింది, కానీ ఆయన యేసు అని ఆమె గుర్తుపట్టలేదు. బహుశ, ఆయన తోట మాలి అనుకొని, అమె పూర్తిగా వెనుకకు తిరిగి ఆయనను సరిగా చూచియుండకపోవచ్చును. అప్పుడు యేసు దేవదూతలు అడిగిన అదే ప్రశ్నను ఆమెను అడిగాడు: “అమ్మా యెందుకు ఏడ్చుచున్నావు, ఎవనిని వెదకుచున్నావు?” అని అడిగాడు. ఆమె ఆయన తోటమాలి అనుకొని, “అయ్యా, నీవు ఆయనను మోసికొని పోయినయెడల ఆయనను ఎక్కడ ఉంచితివో నాతో చెప్పుము, నేను ఆయనను ఎత్తికొని పోదును” అని బదులు చెప్పింది (యోహాను 20:15).

అప్పుడు క్రొత్తనిబంధనలోని అతి చిన్న సంభాషణ ఒకటి కొనసాగింది.[9] ఈ సంభాషణంతటిలోను రెండే రెండు మాటలున్నాయి: యేసు అడిగిన ప్రశ్న ఒకటి, మరియు చెప్పిన ప్రత్యుత్తరము రెండవది. యేసు, “మరియ!” అని ఆమెను పేరుపెట్టి పిలిచాడు. ఆయన ఎవరై యుండెనో అర్థంచేసికొనుటకు ఆ ఒక్క మాటే ఆమెకు సరిపోయింది. ఇప్పుడు ఆమె వెనుకకు తిరిగి ఆయనను నేరుగా చూస్తూ, “రబ్బూనీ!” అని పిలిచింది. రబ్బూనీ అనగా బోధకుడని అర్థం. ఆమెకు చెప్పలేనంత సంతోషం కలిగియుంటుంది గనుక ఆమె ఆయన పాదములపైబడి ఆయనను ముట్టుకొనుటకు ప్రయత్నించబోయింది, కానీ యేసు, “నేను ఇంకను తండ్రి యొద్దకు ఎక్కిపోలేదు గనుక నన్ను ముట్టుకొనవద్దు; ఆయితే నా సహోదరుల యొద్దకు వెళ్లి, ‘నా తండ్రియు, మీ తండ్రియు, నా దేవుడును మీ దేవుడునైన వానియొద్దకు ఎక్కిపోవుచున్నానని’ వారితో చెప్పుము” అని ఆమెతో చెప్పాడు (యోహాను 20:17).[10] ఇవి పునరుత్థానోత్తర దినములు, చేయబడాల్సింది యింకా ఎంతో ఉన్నది. ఆయన నిజముగా మృతులలో నుండి లేచి సజీవుడైయున్నాడని మిగిలిన ఇతర సహోదరులకు తెలియజెప్పబడాలి. గనుక మగ్దలేనే మరియ సమాధి యొద్ద నుండి వెళ్లిపోయి మిగిలిన శిష్యులకు తాను కన్నవాటిని విన్నవాటిని వివరంగా తెలియజెప్పింది (యోహాను 20:18).

“ఆదివారము తెల్లవారినప్పుడు యేసు లేచి, తాను ఏడు దయ్యములను వెళ్లగొట్టిన, మగ్దలేనే మరియకు మొదట కనబడెను. ఆయనతో ఉండినవారు దుఃఖపడి యేడ్చుచుండగా ఆమె వెళ్లి ఆ సంగతి వారికి తెలియజేసెను గాని ఆయన బ్రదికియున్నాడనియు ఆమెకు కనబడెననియు వారు విని నమ్మకపోయిరి” అని మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 16:9–11).

*పునరుత్థానము సంతోషభరితులకు సహాయం చేస్తుంది. బహుశ యేసు పునరుత్థానుడై* తరువాత రెండవసారి కనబడింది ఖాళీ సమాధిని సంధర్శించి యెరూషలేమునకు తిరిగి వెళ్లుచుండిన స్త్రీలకు కావచ్చును.

మగ్దలేనే మరియతో కూడ సమాధి యొద్దకు వచ్చిన స్త్రీలు, సమాధి లోపల దూతను చూచిన తరువాత, ఆయన మృతులలో నుండి లేచియున్నాడని “త్వరగా వెళ్లి ఆయన శిష్యులకు తెలియజెప్పుడి” అని ఉద్బోధింపబడినవారు, యెరూషలేమునకు తిరిగి వెళ్లుచుండిరి. వారు విన్నవాటిని కన్నవాటిని ఇతర శిష్యులకు తెలియజెప్పవలెనని యెరూషలేమునకు ఆతురముగా

పయనించుచు సంభాషించుకొనుచుండిన విషయాలను నీవూహించుకొనగలవా? ఖాళీ సమాధిని చూచుట మరియు యేసు మృతులలో నుండి లేచాడని దూత చెప్పబడుట దినముల తరబడి సంభాషించుకొనునట్లు ప్రేరేపించుటకు సరిపోతుంది, సరికదా ఇట్టి అనుభవము వలన వెంటనే కలిగిన ఉత్తేజము మరియు ఉల్లాసము గూర్చి యిక చెప్పనక్కర్లేదు.

ఈ స్త్రీలు యెరూషలేమునకు వెళ్లుచు, అంత సేపూ తలలు కిందికి వేసుకొని వెళ్లుచుండినవారు కన్నులు పైకెత్తి చూసేసరికి మార్గమునకు మధ్యలో నిలువబడి యుండిన యేసును చూశారు. మనము ఎప్పుడైనా గాని ఒకరి నొకరము కలుసుకొన్నప్పుడు, "వందనాలండీ" అని చెప్పుచూ పలకరించుకొను రీతిలోనే ఆయన వారికి శుభములు తెలియజెప్పాడు. మనమందరము ఒకానొక దినాన చేసేదే ఆ సమయంలో ఆ స్త్రీలు చేశారు – వారు ఆయన పాదములపైబడ్డారు, ఆయనను ముట్టుకొన్నారు, ఆయనను ఆరాధించారు (మత్తయి 28:9). "పరలోకమందున్నవారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసునామమున వంగును ..." అని పౌలు చెప్పుచున్నాడు (ఫిలిప్పీయులకు 2:9, 10). ఇక్కడ యేసు, మృతులలో నుండి లేచి సజీవుడైయున్నవాడు, శరీరధారియైన దేవుడు, వారికి శుభములు తెలియజేస్తూ వారి యెదుట ఉన్నాడు!

యేసు ఆ స్త్రీలతో, "భయపడకుడి; మీరు వెళ్లి, నా సహోదరులు గలిలయకు వెళ్లవలెననియు, వారక్కడ నన్ను చూతురనియు వారికి తెలుపుడి" అని చెప్పాడు (మత్తయి 28:10). "భయపడకుడి" అను మృదువైన మాటలతో, పునరుత్థానుడైన క్రీస్తు సమక్షములో ఉన్నామను ఆలోచనతో అతిగా వణకిపోవుచుండిన వారి హృదయములను ఆయన ఆకర్షించుకొన్నాడు. ఆయన సిలువవేయబడకమునుపు, ఆయన పునరుత్థానుడయ్యాక వారిని గలిలయలో కలిసికొనునని యేసు తన శిష్యులకు వాగ్దానం చేశాడు: "నేను లేచిన తరువాత మీకంటె ముందుగా గలిలయకు వెళ్లెదను" (మత్తయి 26:32). ఇదే వాగ్దానమును సమాధి లోపల కూర్చుండియుండిన దూత కూడ ఈ స్త్రీలకు గుర్తుచేశాడు (మత్తయి 28:7). అది ఆయన మృతులలో నుండి లేచునని చెప్పి దానిని ఆయన నిలబెట్టుకొనవలసిన ఒక వాగ్దానమై యుండినది.

*పునరుత్థానము తీవ్రంగా అనుశోకము చెందువారికి ఆశ్రయము చేకూర్చును.* యేసు పునరుత్థానుడయ్యాక సీమోను పేతురుకు కనబడుట మూడవ ప్రత్యక్షమై యుండును.

పునరుత్థానుడైన యేసు సీమోను పేతురుకు కనబడిన ఈ సందర్భము గూర్చి క్రొత్త నిబంధనలో రెండు సార్లు మాత్రమే సూచింపబడింది. ఎమ్మాయి అను గ్రామమునకు వెళ్లుచుండిన ఇద్దరు దీనిని పేర్కొన్నారు: "ప్రభువు నిజముగా లేచి సీమోనునకు కనబడెను" (లూకా 24:34). పౌలు దీనిని 1 కొరింథీయులకు 15వ అధ్యాయంలో పేర్కొన్నాడు: "ఆయన కేఫాకును, తరువాత పండ్రెండుగురికిని కనబడెను"[11] (1 కొరింథీయులకు 15:5).

పునరుత్థానుడైన యేసు సీమోను పేతురుకు సరిగ్గా ఎక్కడ కనబడ్డాడు మరియు కనబడినప్పుడుండిన ఖచ్చితమైన పరిస్థితులేమై యుండినవి మొ॥ వివరాలు మనకేమియు తెలియవు. పేతురు, "యేసును ఎరుగన"ని బొంకిన తరువాత తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడిన దానినిబట్టి, ఆయనకు ప్రభువు యొక్క జాలి అగత్యమై యుండినదనుటకు ప్రధానంగా ప్రత్యేకించి పేర్కొనబడుచున్నాడు. దూత సహితము స్త్రీలతో, "మీరు వెళ్లి ఆయన

మీకంటె ముందుగా గలిలయలోనికి వెళ్లుచున్నాడనియు; ఆయన మీతో చెప్పినట్టు అక్కడ మీరు ఆయనను చూతురనియు ఆయన శిష్యులతోను పేతురుతోను చెప్పుడి" అని చెప్పాడు (మార్కు 16:7).

ఆయన ఎవరికైతే ఎక్కువగా అవసరమై యుంటాడో వారి యెడల ప్రభువు ఆకర్షితుడౌతాడు. పునరుత్థానుడైన యేసు కనబడుటకు అర్హుడుకాడని చెప్పుకొనబడగల అపొస్తలుడు ఎవరైనా ఉండియున్నట్లయితే, అది పేతురే; కానీ ఆ యేసే కనబడుట నిజముగా అవసరమై యుండిన అపొస్తలుడు ఎవరైనా ఉండియున్నట్లయితే, అదీ పేతురే. మన ప్రభువు తన శిష్యులతో కూడ గడిపిన చివరి రాత్రి సమయంలో, "ఈ రాత్రి కోడి కూయక మునుపే నీవు నన్ను ఎరుగనని ముమ్మారు చెప్పెదవు" అని యేసు పేతురుతో చెప్పాడు (మత్తయి 26:34). అప్పుడు పేతురు, "నేను నీతో కూడ చావవలసివచ్చినను, నిన్ను ఎరుగనని చెప్పను" అని ప్రతిస్పందించాడు (మత్తయి 26:35ఎ). అప్పుడు పేతురు, తానన్న మాటలు పూర్తిగా తన ఉద్దేశపూర్వకమైనవే అయి యుండవచ్చును, కానీ ఒకరి పరిపక్వతా గుణం పరీక్షింపబడు పరిస్థితిలో దౌర్భల్యమునకు గురియగుటకు అతడు ఎంత అనువైనవాడై యుండెనో అతడు గ్రహించలేదు.

యేసు పట్టబడిన తరువాత, ఒక ప్రక్క తీర్పు ప్రక్రియ జరుగుచుండగా పేతురు ప్రధాన యాజకుని[12] ఇంటి ప్రాంగణము వరకు యోహానును వెంబడించాడు, ప్రాంగణ ద్వారము నొద్ద కాపలాగా ఉన్న ఒక చిన్నది, పేతురును తేరిచూస్తూ, "వీడును అతనితో కూడ ఉండెను" అని చెప్పింది (లూకా 22:56బి). అయితే పేతురు, "అమ్మాయీ, నేనతని నెరుగను" అని మొండిపట్టుతో చెప్పాడు (లూకా 22:57బి). కొంతసేపైన తరువాత, చలికాచుకొనుటకు పెట్ట బడిన చిన్న మంట చుట్టూర వారందరు కూర్చొనియుండగా, మరొకడు పేతురును చూచి, "నీవును వారిలో ఒకడవు" అని అన్నాడు. అందుకు పేతురు, "ఓయీ, నేను కాను!" అని ప్రతినిందగా ప్రత్యుత్తరమిచ్చాడు (లూకా 22:58).[13] దాదాపు ఒక గంట సమయం గడచిన తరువాత ఒకడు, "నిజముగా వీడును అతనితో కూడ ఉండెను, వీడు గలిలయుడు"; "నీవు తోటలో అతనితో కూడ ఉండగా నేను చూడలేదా?" అని చెప్పాడు (లూకా 22:59; యోహాను 18:26). ఇతడు మల్కు అనగా తోటలో యేసు పట్టబడుచుండినప్పుడు పేతురు తన కత్తి దూసి చెవి తెగనరికినవానికి బంధువు. పేతురు శపించుకొనుటకును ఒట్టుపెట్టుకొనుటకును మొదలుపెట్టి (మత్తయి 27:74), "ఓయీ, నీవు చెప్పినది నాకు తెలియదు" అని అన్నాడు (లూకా 22:60). శోధకుని చేత మాటిమాటికీ పిడికిళ్లతో బాధపడుచున్నట్లుండి, చక్రపవనం వంటి నిందలలో చిక్కుకొన్న పేతురు, తన నిగ్రహాన్ని కోల్పోయి దేవదూషణకరమైన మాట లతో తన బొంకులను ఒత్తిపలికాడు. పేతురు బొంకుడు మాటలు పలుకుచుండగా, కోడి రెండవసారి కూసింది.[14] ప్రభువు పలికిన ప్రవచనము నెరవేరింది.

యేసుకు సాంప్రదాయకమైన విధానంలో శిక్ష విధింపబడు నిమిత్తము ఆయనను యూదుల మహా సభ యెదుటికి తీసికొని వచ్చారు. ఈ స్థానచలనం జరుగుచుండినప్పుడు, యేసు అటు తిరిగి పేతురు వైపు చూశాడు (లూకా 22:61). అప్పుడు పేతురు యేసు ముఖంలోనికి చూచుచుండగా, అతడు యేసు పలికిన ప్రవచనమును జ్ఞాపకం చేసికొన్నాడు. బహుశ అతడు యేసు ముఖంలోనికి చూచుచుండగా, అతడు బొంకునని ముందుగానే తెలియజెప్పుచూ యేసు కనుపర్చిన మృదత్వమును పేతురు జ్ఞాపకం చేసికొనియుంటాడు

(లూకా 22:31-34). పేతురు హృదయం బ్రద్దలయ్యింది, గనుక అతడు అంధకారం మాటున కనుమరుగై, "సంతాపపడి యేడ్చెను" (లూకా 22:62). ఒక ప్రక్క కటిక చీకటి కమ్ముకొని యుండగా మరొక ప్రక్క ఆవల యేసు అపహాస్యపు తీర్పు తీర్చబడుచుండిన సమయంలో వినబడుచుండిన అల్లరి కేకల చేత తీవ్రతరం చేయబడుచుండినందువలన, అపరాధ భావము మరియు అవమాన భారము అతనిని అలుముకొన్నాయి.

యేసు సిలువవేయబడుచుండగా పేతురు తనలో తాను ఎంత నిరుత్సాహపడి యుంటాడో నీవూహించుకొనగలవా? "సరిగ్గా నేను ఆయనకు అత్యవసరమై యుండిన సమయంలోనే, నేను ఆయనను విడిచిపెట్టాను కదా!" అంటూ పేతురు తనలో తాను బాధతో మూల్గియుంటాడు. పేతురు శనివారమంతా, లోతైన నిరాశ మరియు ఆశలు వదులుకొన్న అధైర్యంతో గడిపియుంటాడు. తాను చేసిన తప్పును ఇప్పుడు ఎలా నిష్కృతి చేసికొని మారుమనస్సు నొందిన జీవితాన్ని మరలా ఎలా మొదలుపెట్టాలో తెలియక, తనలో తాను మెండైన ఆశాభంగాన్ని అనుభవించాడు. మానవ రాశిలో అతడు అధమాధమ అంకములో ఉన్నాడనియు, పాపులలో ప్రధానుడనియు, లోకమునకు ఘోరాతిఘోరమైన స్నేహితుడనియు తననుతాను ఎంచుకొనుచుండెను.

యేసు దైవికమైన దయాదాక్షిణ్యముతోను కృపాకనికరముతోను కూడుకొని యుండిన తన హస్తాన్ని పేతురుకు అందించాడు. అది ఆయనకు విరోధముగా ఎంతటి సిగ్గుచేటైన పాపమైనప్పటికిని, యేసు ద్వేషమును ఎన్నడునూ తన మనస్సులో ఉంచుకొనడు. ఆయన ఎప్పుడైనాగాని రాబట్టుకొనుచుండు మరియు ఉపయోగ యోగ్యముచేయుచుండు పనులలో నిమగ్నమై యుంటాడు. ఆయన మనలను ఎంత మాత్రమును త్రోసివేయడు. మనలను మనము సంపూర్తిగా ఆయన హస్తాల్లోనికి అప్పగించుకొనవలసింది మనమే. మన అభిమతములను ఆయన లెక్కచేయకుండా ఉండడు, కానీ మనలను మనము ఎంత నాశనం చేసికొన్నా, మనలను ఆయనవైపు పునరుద్ధరించుకొనుటకు ఆయన ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటాడు.

పునరుత్థానుడైన యేసు పేతురుకు కనబడినప్పుడు అతనితో ఏమి చెప్పాడో మనకు తెలియదు, కానీ ఆయన అగుపించుట పేతురుకు ఒక గొప్ప నమ్మిక కలిగించినదై యుంటుంది. ప్రత్యక్షత యొక్క స్వరం, "పేతురూ, నీవొక పెద్ద తప్పు చేశావయ్యా, కానీ నీవు పశ్చాత్తాపపడ్డావు. గతం గడిచిపోయింది గనుక దాని గూర్చి అలోచిస్తూ ఉండవద్దు. నేను నిన్ను క్షమిస్తున్నాను. నీవు ప్రస్తుత వర్తమాన కాలములోను రాబోవు భవిష్యత్‌కాలములోను జీవించాలి. నీ యెడల నీ గతము క్షమింపబడి నీవు ప్రతి దినము ఎటువంటి అపరాధ భావము లేకుండా జీవించునట్లు నేను మరణించాను మరియు మరలా లేచాను. రా, నా సేవకుడవై యుండు. నీవు నా కొరకు గొప్ప కార్యములు చేయగలవు" అనునదై యుండును. యేసయ్య పేతురుతో ఏమి చెప్పాడో మనకు తెలియనప్పటికిని, యేసు కనబడిన తరువాత పేతురు సంపూర్తిగా మారిపోయాడని మనకు తెలియును. కొన్ని దినములు గడిచిన తరువాత, పెంతెకొస్తు దినాన పేతురు, అది అతని ప్రాణానికే ప్రమాదము తెచ్చిపెట్టు పరిస్థితిగా ఉండినప్పటికిని బహు ధైర్యంతో ప్రబోధించాడు (అపొస్తలుల కార్యములు 2:14-36).

పునరుత్థానుడైన యేసు పేతురుకు కనబడుట గూర్చి వ్రాయబడినదంతా మనకు ఎంతో ప్రోత్సాహము నిచ్చునదై యున్నది. మనము పాపము చేసినప్పుడు సహితము యేసు మనలను ప్రేమిస్తాడని మనకు గుర్తుచేస్తూ, అది క్రీస్తు మనస్సును చిత్రీకరించుచున్నది. పాపములో

పడిపోయిన మనము పశ్చాత్తాపముతో ఆయన యొద్దకు పరుగెత్తుకొని వచ్చినప్పుడు, యేసు మనలను పునరుద్ధరించి ఆయన యొద్దకు ఆకర్షించుకొని మనము అట్టి పాపము ఎన్నడూ చేయలేదన్నట్లుగా మనలను అక్కున చేర్చుకొంటాడు. ఆయన పాపమును మన్నించడు, కానీ పశ్చాత్తాపపడి దైవికమైన షరతుల ప్రకారము దేవుని కృపను వెదకుచుండు ప్రతి పాపిని క్షమిస్తాడు.

*పునరుత్థానము అపేక్షగలవారికి ఆదరణనిస్తుంది.* యేసు పునరుత్థానుడైన తరువాత ఆయన నిరుత్సాహము చెంది ఎమ్మాయు గ్రామమునకు వెళ్లుచుండిన ఇద్దరు శిష్యులకు కనబడుట నాల్గవ ప్రత్యక్షమై యున్నది (లూకా 24:13–35).

ఇద్దరు శిష్యులు యెరూషలేమునకు[15] కొద్ది దూరములో ఉండి వారు నివసించుచుండిన ఎమ్మాయు అను ఒక చిన్న గ్రామమునకు కాలినడకన కదలి వెళ్లుచుండిరి. వారిలో ఒకని పేరు క్లెయొపా. రెండవ వాని పేరు ఇవ్వబడలేదు. వారు చాలా నిరుత్సాహముతో ఉన్నారు వారి యొద్ద వాస్తవాలున్నాయి కానీ వాటన్నిటినీ వారు సరైన రీతిలో క్రోడీకరించుకొనలేదు, తత్ఫలితంగా, వారిలో సరైన తుది అభిప్రాయమేర్పడలేదు.

వారు ప్రయాణమై వెళ్లుచుండగా, ఎవరో ఒకరు వారితో కలిసారు. ఆ కలిసినవాడు క్రీస్తే అని వారు గుర్తెరుగకుండనట్లు దేవుడు వారి కళ్ల యెదుట ఒక తెరను ఉంచాడు. నీవు కూడ యిలాగే ఒక బాటలో గాని లేదా ఒక సమావేశాల గుండా గాని నడుచుకుంటూ వెళ్తూవుంటే, ఎవరో ఒకరు వచ్చి నీతో కూడ నడుచుట ఎప్పుడైనా తటస్థించిందా? అతడెవరో నీకు తెలియదు, పరిచయము అసలే లేదు, కానీ నీవు అతనితో మాటలాడుటకు మొదలు పెట్టావు. “ఈ రోజు భలే మంచి పసందైన రోజు కదా” అని నీవు చెప్పియుండవచ్చును. ఈ ఇద్దరి శిష్యులకు కూడ ఇలాంటిదే ఏదో ఒకటి ఎదురయ్యింది. వారు వెళ్తూవున్నారు, బహుశా ఎవరో ఒకరు వారు వెళ్లుచుండిన దారిని కలిపే పిల్లదారిలో వచ్చారు. ఎవరో ఒకరు వచ్చినట్లున్నారే అను తలంపు వారిలో పుట్టక మునుపే, ఒక అపరిచితుడు వారి ప్రక్కలోనే నడుస్తున్నాడని తెలుసుకొన్నారు. ఆయన, “మీరు నడుచుచు ఒకరితో ఒకరు చెప్పుకొనుచున్న యీ మాటలేమిటి?” అని వారినడిగాడు (లూకా 24:17). ఇదేదో వింతగా ఉన్నదే అన్నట్లు ఆ ఇద్దరు శిష్యులు ఆగిపోయి, ఒకరి ముఖం మరొకరు చూచుకుంటూ, “యెరూషలేములో బసచేయుచుండి, యీ దినములలో అక్కడ జరిగిన సంగతులు నీవొక్కడవే యెరుగవా?” అని ప్రశ్నించారు (లూకా 24:18). అప్పుడా పరదేశి, “అవి ఏ సంగతులు?” అని వారినడిగాడు. అందుకు వారు ఇలా జవాబిచ్చారు.

> నజరేయుడైన యేసును గూర్చిన సంగతులే, ఆయన దేవునియెదుటను ప్రజలందరి యెదుటను క్రియలోను వాక్యములోను శక్తిగల ప్రవక్తయై యుండెను. మన ప్రధాన యాజకులును అధికారులును అయనను ఏలాగు మరణశిక్షకు అప్పగించి, సిలువవేయించిరో నీకు తెలియదా? ఇశ్రాయేలును విమోచింపబోవువాడు ఈయనే అని మేము నిరీక్షించి యుంటిమి; ఇదిగాక యీ సంగతులు జరిగి నేటికి మూడు దినములాయెను. అయితే మాలో కొందరు స్త్రీలు తెల్లవారగానే సమాధియొద్దకు వెళ్లి, ఆయన దేహమును కానక వచ్చి, కొందరు దేవదూతలు తమకు కనబడి ఆయన బ్రదికియున్నాడని చెప్పిరని మాతో చెప్పి మాకు విస్మయము కలుగజేసిరి (లూకా 24:19–23).

అందుకు యేసు, “అవివేకులారా, ప్రవక్తలు చెప్పిన మాటలన్నిటిని నమ్మని మందమతులారా!”

అంటూ వారిని మందలిస్తున్నాడు (లూకా 24:25). యేసు ఈనాడు ఇక్కడ ఉన్నట్లయితే, మనలను కూడ యిలాగే గద్దించియుండును: "... నమ్మని మందమతులారా!" మనకు ఎన్నో నిదర్శనాలున్నాయి. అలాంటప్పుడు నమ్మడానికి మనము ఎందుకింత సంకోచిస్తున్నాము? యేసు, "క్రీస్తు యీలాగు శ్రమపడి తన మహిమలో ప్రవేశించుట అగత్యము కాదా?" అని యింకా కొంచెం విస్తరించాడు (లూకా 24:26). మోషేతో మొదలుపెట్టి ప్రవక్తలందరిని పేర్కొంటూ, ప్రవక్తలు పలికిన ప్రవచనములను క్రీస్తు ఎలా నెరవేర్చాడో యేసు విపులంగా తెలియజెప్పాడు. యేసు, "ప్రవచనములు మరియు వాటి నెరవేర్పు" అను శీర్షిక గల ఒక పాఠ్యాంశమును బోధిస్తూవుంటే వినడము అది ఎలా ఉండినదో నీవూహించుకొనగలవా? అటుతరువాత, యేసు వారితో మాటలాడుచుండగా వారు వింటూవుంటే ఈ ఇద్దరి శిష్యుల హృదయాలు వారిలో మండుచుండినవని మనము తెలిసికొనుచున్నాము (లూకా 24:32).

ఇంతలో వారి ప్రయాణం దాదాపుగా ముగింపుకు వచ్చి వారు వారి ఇంటి వైపు వెళ్లే ప్రక్కదారి సమీపించింది. అయితే యేసు మాత్రం ఆయన యింకా కొంచెం దూరం ముందుకు వెళ్లాల్సి ఉందని వారికి సూచించాడు. కాబట్టి, వారు ఆ రాత్రి ఆయన వారితో కూడ బస చేయవలెనని ఆయనను ఆహ్వానించారు. ఎవరైతే యేసును మనఃపూర్వకంగా ఆహ్వానిస్తారో ఆయన ఆ ఆహ్వానాన్ని మన్నించి ఆహ్వానితులతో కూడ ఆనందించుటకు ఆనందంగా అరుదెంచును. యేసు వారితో కూడ వారి ఇంటిలోనికి వచ్చాడు గనుక ఆ నాటి సాయంకాలం, అందరూ కలిసి భోజనానికి కూర్చున్నారు. యేసు ఆయన ముందర ఉంచబడిన రొట్టెను తీసికొని, దానిని ఆశీర్వదించి, విరిచి, వారిలో ఒక్కొక్కనికి ఇచ్చాడు. యేసు వారి ఇంటి లోనికి ఒక అతిథిగా వెళ్లాడు, కానీ ఆయన త్వరగా వారికి అతిథేయుడయ్యాడు. యేసు లోనికి ప్రవేశించినప్పుడెల్లా ఇలాగే జరుగుతుంది. ఆయన మన హృదయములోనికి ఒక అతిథిగా ప్రవేశిస్తాడు, కానీ ఆయన మన హృదయములోనే నిలిచియున్నట్లయితే, ఆయన ప్రభువుగా మన హృదయములనేలును. దేవుడు వారి కంటి పొరను తొలగించాడు. అప్పుడు వారు భోజనపు బల్లయొద్ద యేసుకు ఎదురుగానే కూర్చొని యుండిరని గ్రహించారు. వారు ఆయనను కొన్ని క్షణములు కన్నులారా చూశారు, ఇంతలోనే ఆయన అదృశ్యుడయ్యాడు (లూకా 24:31). భోజనం బల్ల యొద్ద పునరుత్థానుడైన యేసుతో కూడ కూర్చుండుట అదెలా వుంటుందో ఒక్కసారి ఊహించుకొనండి!

ఇలా జరుగగానే ఆ ఇద్దరు శిష్యులు భోజనాన్ని ముగించకుండానే, వారి ఇంటిలో నుండి గబగబా వెలుపలికి వచ్చి, మరలా యెరూషలేము చేరుకున్నారు. శిష్యులు పదనొకండుగురు అపొస్తలులతో కలిసి అందరూ ఒక్క చోట కూడుకొని యుండుట చూశారు. పునరుత్థానుడైన క్రీస్తును చూచినవారిలోనే గుర్తుపట్టదగు లక్షణమై యుండు ఉత్సాహపూరితమైన ఉద్రేకముతో, యేసు మృతులలో నుండి లేచి సజీవుడైయున్నాడని కూడుకొని యున్న సహోదరులకు తెలియజెప్పుచు, ఆయన వారికిని పేతురుకును కనబడిన దృశ్యాన్ని వివరించారు (లూకా 24:34, 35).

*పునరుత్థానము భయభక్తులుగలవారికి వారిని బలపరచు ఉపచారము చేయును.* యేసు పునరుత్థానుడైన తరువాత ఆదివారం సాయంకాలమున యెరూషలేములో ఎంతో ఆత్రుతతో కూడుకొనియుండిన శిష్యులకు అగుపించుట ఐదవ ప్రత్యక్షత.

వీరు ఎచ్చోట కూడుకొనియుండిరో మనకు తెలియదు. అయితే వారు యెరూషలేములో

ఎక్కడో తలుపులు మూయబడి యుండిన ఒక గది లోపల కూడుకొని యుండిరని తెలియును (లూకా 24:37; యోహాను 20:19). "వారు ఏదో ఒక నెపంతో యేసును సిలువ వేసారు, ఇక మనలను మాత్రం వదిలిపెడతారా, తరువాతి తరుణం మనదే" అని వారు అనుకొంటూ ఉండవచ్చును.

అదే సాయంకాలం ఏదో ఒక సమయంలో, యేసు వారి మధ్యన అగుపించాడు. ఆయన, "మీకు సమాధానము కలుగునుగాక" అని పలికాడు (యోహాను 20:19). అప్పటి వరకు ఆయనను చూడనివారు వారొక భూతమును చూచుచున్నారని అనుకొన్నారు (లూకా 24:37). ఆయన, "మీరెందుకు కలవరపడుచున్నారు? మీ హృదయములలో సందేహములు పుట్టనేల? నేనే ఆయనను అనుటకు నా చేతులను నా పాదములను చూడుడి; నన్ను పట్టి చూడుడి, నాకున్నట్టుగా మీరు చూచుచున్న యెముకలును మాంసమును భూతమునకుండవు" అని చెప్పాడు (లూకా 24:38, 39: యోహాను 20:20 చూడండి). ఇంత చెప్పినా వారిలో కొందరు యింకా సంశయించుచు వారి కళ్లను వారే నమ్మలేకపోయారు. క్రీస్తు కనబడగానే వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అప్పుడు యేసు, "ఇక్కడ మీ యొద్ద ఏమైన ఆహారము కలదా?" అని అడిగాడు (లూకా 24:41). వారు కాల్చిన చేపను ఆయనకిచ్చారు. ఆయన దానిని తీసికొని వారి కళ్ల ముందే ఆరగించాడు (లూకా 24:42, 43). ఇంత కన్నా యింకా గొప్ప నిదర్శనము వారికి చూపింపబడలేదు. యేసు వారి యెదుట ప్రాణ ఘాతుక గాయములు కలిగియుండిన శరీరముతో ఉపస్థితుడైయున్నాడు. ఈ గాయములకు దేవుని కుమారుడు మినహా యింకెవరైనా వారు మరణించి యుందురు. ఆయన సజీవుడై యున్నాడను రుజువును కనుపర్చుటకు ఆయన కివ్వబడిన చేపను ఆయన వారి యెదుటనే తిన్నాడు.

ఆయన మృతులలో నుండి లేచి సజీవుడైయున్నాడను అతి స్పష్టమైన నిదర్శనమును సమకూర్చిన తరువాత, ఆయన వారికి బోధించుటకు మొదలుపెట్టాడు. ప్రవక్తల గ్రంథములలో వ్రాయబడినవన్నియు ఆయనలో నెరవేరినవని వారికి గుర్తుచేశాడు (లూకా 24:44). జరిగిన విషయాన్ని వారు మరి ఎక్కువ స్పష్టంగా గ్రహించునట్లు వారికి సహాయం చేశాడు (లూకా 24:45). అప్పుడాయన చెప్పిన మాటలివి:

> క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు, యెరూషలేము మొదలుకొని సమస్త జనములలో ఆయనపేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది. ఈ సంగతులకు మీరే సాక్షులు, ఇదిగో నా తండ్రి వాగ్దానము చేసినది మీమీదికి పంపుచున్నాను; మీరు పైనుండి శక్తి పొందువరకు పట్టణములో నిలిచి యుండుడి (లూకా 24:46–49).

ఆయన, "పరిశుద్ధాత్మను పొందుడి. మీరు ఎవరి పాపములు క్షమింతురో అవి వారికి క్షమింపబడును; ఎవరి పాపములు మీరు నిలిచియుండనిత్తురో అవి నిలిచియుండును" అని కూడ వారితో చెప్పాడు (యోహాను 20:22, 23). ఈ మాటలు ఒక అపేక్షను అంకురింపజేస్తూ అపొస్తలుల కార్యములు 2:1–4లో వ్రాయబడియున్నట్లు పెంతెకొస్తు దినాన అపొస్తలులపై కుమ్మరింపబడనై యుండిన పరిశుద్ధాత్మ గూర్చిన వాగ్దానము నిచ్చాయి. ఈ మాటలు క్రైస్తవ యుగములో పరిశుద్ధాత్మ చేత నిర్దేశనము చేయబడువారు కలిగియుండు

అధికారమును కూడ సూచిస్తున్నాయి. పరిశుద్ధాత్మ చేత నడిపింపబడుచు, ప్రజల పాపములు క్షమింపబడుటకు గల పరలోక షరతులను అపొస్తలులు లోకమును చాటిచెప్పుదురు. పరలోక షరుతులకు విశ్వాసముతో విధేయుడగు ప్రతివాడును క్షమాపణ పొందుతాడు; ఈ షరతులను తృణీకరించు ప్రతివాని పాపములను ప్రభువు క్షమించడు.

పునరుత్థానడైన యేసు ప్రత్యక్షతలన్నియును మనకు అసాధారణమైన రీతిలో ఉపచారము చేయును. అవి మనకు అవసరమైనవి సమకూర్చును. అవి మన జీవితాల్లోను లోతైన అంశాల్లోనికి చొచ్చుకొనిపోయి మనము సంపూర్తిగా విశ్వసించునట్లు మన హృదయాలకును మేధస్సుకును కావలసిన ఆలంబనము నిచ్చును. గనుక మన శేష జీవితమంతటిలోను పునరుత్థానము మనకు ఉపచారము చేయునట్లు అనుమతించుదము.

❖◆❖◆❖

*ఎవరైనా ఒకరు యేసునందు విశ్వాసముంచి క్రైస్తవుడైనప్పుడు, అతడు తన జీవితమును "(నేనే) జీవించువాడను; మృతుడనైతిని గాని ఇదిగో, యుగయుగములు సజీవుడనై యున్నాను, మరియు మరణము పాతాళపు చెవులు నా స్వాధీనములో ఉన్నవి" అని చెప్పుచు, ఎల్లప్పుడూ ఉండిన లేదా ఎల్లప్పుడు ఉండనైయున్న మతపరమైన ఒకే ఒక నాయకునికి అప్పగించుకొన్నాడు (ప్రకటన 1:18).*

---

సూచనలు

[1]మార్కు 15:43; యోహాను 19:38 చూడుము. సన్హెడ్రిన్ సభ (యూదుల మహా సభ) యూదుల అత్యున్నతమైన పాలనాధికార న్యాయస్థానమై యుండినది. ఈ మహాసభలో 70 మంది సభ్యులుండిరి. యేసు విషయంలో మరణశిక్ష విధించబడినప్పుడు యోసేపు ఆ సమావేశంలో లేడు. ఆయన సజ్జనుడును నీతిమంతుడునైయుండి వారి ఆలోచనకు సమ్మతింపలేదు (లూకా 23:51). [2]నీకొదేము కూడ సన్హెడ్రిన్ సభలో సభ్యుడై యుండెను. ఆయన యేసు క్రీస్తును విశ్వసించినవాడై యుండెను. అంతకు మునుపు యేసు పరిచర్య చేయుచుండిన సమయంలో, ఆయన యేసు నొద్దకు రాత్రివేళ వచ్చి రక్షణ గూర్చి చర్చించాడు (యోహాను 3:1–21). [3]"ఎవడును ఎప్పుడును ఉంచబడని క్రొత్త సమాధి యొకటి ఉండెను" అని యోహాను చెప్పుచున్నాడు (19:41). అనేక సమాధులలో శవములు ఒకదానిపై మరొకటి చాలా ఉంచబడినవి, కానీ ఈ సమాధి క్రొత్తగా తొలిపించుకొనబడింది మరియు అందులో ఎవడును ఎప్పుడును ఉంచబడలేదు. గనుకనే ఈ సమాధి లోపలనుండి పునరుత్థానుడైనది యేసు కాదు గాని మరొకరు అని చెప్పడానికి ఎటువంటి అవకాశము లేదు. [4]యూదుల పద్ధతి ప్రకారము ఒక రోజులోని ఏ కొంత భాగమునైనను కలుపుకొని ఒక రోజుగా లెక్కించు వాడుక కలదు. ఒక రోజులోని ఏ కొంచెము భాగమునైనను కూడ అలంకారికంగా "ఒక పగలు మరియు ఒక రాత్రి" అని యూదులు లెక్కించుచుండిరి. ఆయన మనుష్య కుమారుడు "మూడు రాత్రింబగళ్లు భూగర్భములో ఉండును" అని చెప్పుచు తాను సమాధిలో ఉంచబడు సమయము సమీపించుచుండిన సందర్భములను ప్రస్తావించిన ప్రతిసారి ఆయన సమయాన్ని లెక్కించినది కూడ నిస్సందేహంగా ఈ విధానంలోనే (మత్తయి 12:40). [5]"వారు ఆదివారమున పెందలకడ (లేచి, బయలుదేరి) సూర్యోదయమైనప్పుడు సమాధి యొద్దకు వచ్చుచుండగా ..." అని మార్కు 16:2బి చెప్పుచున్నది. ఇతర ఉల్లేఖనములు, "విశ్రాంతి దినము గడచిపోయిన తరువాత ఆదివారమున, తెల్లవారుచుండగా ..." అనియు (మత్తయి 28:1బి); "ఆదివారమున తెల్లవారుచుండగా" (లూకా 24:1బి) అనియు; "ఆదివారమున ఇంకను చీకటిగా ఉన్నప్పుడు ..." (యోహాను 20:1బి) అనియు చెప్పుచున్నవి. స్త్రీలు సమాధి యొద్దకు సూర్యోదయమునకు ముందే లేక తెల్లవారక ముందే బయలుదేరి యుందురు మరియు వారు సమాధి యొద్దకు చేరుకునే సరికి ఇంకా చీకటిగానే ఉంటూ అప్పుడప్పుడే సూర్యుడు మెల్లమెల్లగా ఉదయించి యుండును. [6]యేసు భూకంపమునకు ముందే లేచియుండును. భూకంపము కేవలము దూతలు కనబడి సమాధి ద్వారమునకు అడ్డంగా ఉంచబడిన రాయిని పొర్లించిన ఒక ఆకస్మిక క్షణమై యుండును. [7]"వారు సమాధిలో ప్రవేశించి, తెల్లని నిలువుటంగీ ధరించుకొనియున్న యొక పడుచువాడు కుడివైపున కూర్చుండుట చూచి మిగుల కలవరపడిరి" అని మార్కు చెప్పుచున్నాడు (మార్కు 16:5). మాట లాడిన ఒక్క దూతపై తన దృష్టిని కేంద్రకరిస్తూ కాబోలు మార్కు ఏక వచనము వాడుచుండగా లూకా ఇద్దరు దూతలు అని పేర్కొంటున్నాడు. [8]కొన్ని వ్రాత ప్రతులలో లూకా 24:12 వ్రాయబడిలేదని గుర్తించుకొనవలెను. ఏది ఏమైనా, యోహాను, "అప్పుడు మొదట సమాధియొద్దకు వచ్చిన ఆ శిష్యుడు లోపలికి పోయి చూచి నమ్మెను" అని పేర్కొనుచున్నాడు (20:8). పేతురు నమ్మెనని యోహాను చెప్పుటలేదు. ఆయన ఈ విధంగా చెప్పుట ద్వారా వారు చూచిన దాని ఫలితంగా ఇద్దరిలో ఒక్కడే నమ్మాడను

భావము కలుగుచున్నది. [9]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel* (Cincinnati, Ohio: The Standard Publishing Foundation, n.d.), 744. [10]మన ప్రభువు మరియతో చెప్పిన మాటలను జే. డబ్ల్యు మెక్‌గార్వే ఈ క్రింది విధంగా భావానువాదం చేశాదు: "నన్ను ముట్టుకొని నిన్ను నీవు నిలిపియుంచుకొనవద్దు నేను వెళ్లకుండా నన్ను నిర్బంధించవద్దు; నేను యింకా ఆరోహణము కాలేదు; ఇది సంక్షిప్తమును తాత్కాలికమునైన దర్శనము కాదు; నేను ఇంకా ఇహమందే ఉన్నాను, మరియు యింకా కొంత కాలముందును, నన్ను చూచుటకు ఇతరమైన అవకాశములు యింకా ఉన్నాయి; నీవు వెంటనే చేయాల్సిన పనేమంటే నీవు వెళ్లి నేను మృతులలో నుండి లేచాననియు, నా తండ్రి యొద్దకు ఎక్కిపోదుననియు దుఃఖించుచున్న నా శిష్యులకు తెలియజెప్పాలి" (Ibid., 744).

[11]"పండ్రెండుగురు" అను పదజాలము అపొస్తలుల"కు ఒక అలంకారిక పదజాలమయ్యింది. అది అక్షరార్థంగా సరియైనది కాదు, కానీ అలంకారికంగా సరైనదే. [12]"యోహాను ప్రధాన యాజకునికి నెళవైనవాడే, గనుక, ఆయన ఇంటి ప్రాంగణములోనికి ప్రవేశించుటకు అనుమతించబడినాడు (యోహాను 18:15, 16). యోహాను ద్వారపాలకునితో మాటలాడినప్పుడు పేతురు అతనితో కూడ ప్రాంగణములోనికి వెళ్లుటకు అనుమతించబడినాడు. [13]పేతురు రెండవసారి బొంకుట బొంకుల రాసియై యుండింది. పనికత్తెలలో ఒకతె, "నీవును నజరేయుడగు ఆ యేసుతో కూడ ఉండినవాడవు" అని అన్నది. అందుకు పేతురు, "ఆయన ఎవరో నేనెరుగను; నీవు చెప్పినది నాకు బోధపడలేదు" అని చెప్పాడు (మార్కు 14:66–68). ఆమె చుట్టూర ఉండినవారు కూడ ఆమెతో చేరి, "నీవును ఆయన శిష్యులలో ఒకడవుకావా?" అని అన్నాడు. అందుకు పేతురు, "నేను కాను, నేనెరుగను" అని అన్నాడు (యోహాను 18:25). పేతురు తలవాకిటి వసారాలోనికి వెళ్లినప్పుడు, "నీవుని వారిలో ఒకడవు" అని ఒకడన్నాడు. అందుకు పేతురు, "ఓయీ, నేను కాను!" అన్నాడు (లూకా 22:58). పనికత్తె ఆమె చుట్టూర ఉండినవారిని చూచి, "వీడు వారిలో ఒకడు!" అని చెప్పింది (మార్కు 14:69). అప్పుడు పేతురు, "ఆ మనుష్యుని నేనెరుగను" అని ఒట్టుపెట్టుకొనుచు చెప్పాడు (మత్తయి 26:72) వీరంతా ఒక్కటే గుంపు అని అనిపించునంత వేగంగా పేతురు నాలుగు వెవ్వేరు గుంపులతో ఒక గుంపు తరువాత మరొక గుంపుతో బొంకాడు. [14]కోడి రెండు పర్యాయములు కూసినట్లున్నూ, పేతురు బొంకుట ఈ రెండు కూతల మధ్య జరిగినట్లున్నూ మార్కు వ్రాయుచున్నాడు (మార్కు 14:68–72). కానీ లూకా (లూకా 22:34) మరియు యోహాను (యోహాను 13:38) కోడి ఒక్క మారే కూసిందని పేర్కొంటూ పేతురు కోడి కూయక మునుపు యేసును ఎరుగనని బొంకాడని వ్రాయుచున్నాడు. కోడి మొదటిసారి కూసినప్పుడు అది మధ్యరాత్రి. రెండవ కూత దాదాపుగా ఉదయం మూడు గంటలకు వినబడుచూ, సూర్యోదయమగుచుండినదని సూచించినదై యుండింది. పేతురు బొంకిన సరైన కాలమున, మధ్య రాత్రికిని ఉదయం మూడు గంటల నడుమ అని మార్కు తెలియజెప్పుచున్నాడు, అయితే లూకా మరియు యోహాను, సూర్యోదయమును సూచించుచూ, బొంకుట జరుగబోవు దానికి ముందటి కాలమును తెలియజేయుచున్నారు. [15]పురావస్తు శాస్త్రజ్ఞులు ఎమ్మాయు గ్రామమును ఖచ్చితంగా గుర్తించలేదు, కానీ అది యెరూషలేమునకు దాదాపు ఏడు మైళ్ల దూరములో (దాదాపు పదిన్నర కిలోమీటర్లు) ఉన్నదని లూకా 24:13 మనకు తెలియజెప్పుచున్నది. ఆ ఇద్దరు శిష్యులు ఆ మార్గాన ఆదివారం సాయంకాలం పయనిస్తున్నారు, యేసును కలుసుకొన్న తరువాత సహోదరులను కలిసికొనుటకు వెనుకకు తిరిగి యెరుషలేమునకు వెళ్లారు (లూకా 24:33).